సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



రాములోరికి తలంబ్రాలు

కోల్‌సిటీ: శారదానగర్ కోలాటం బృందం మహిళలు రాములోరి కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు తయారుచేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం

రామగుండం: ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

32.4/19.4

పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది.

కారుచౌక జర్నీ

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న 'కార్ పూలింగ్' కల్చర్

- తక్కువ చార్జీకే ప్రయాణం
- రాజధాని, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు యాప్‌లో సీటు బుకింగ్
- ఉద్యోగుల ప్రాధాన్యం దీనికే..
- నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం
- ఇంధనం, డబ్బు ఆదా



సండే స్పెషల్

నగరానికి చెందిన అఖిల్ అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. బస్సుల్లో రద్దీ చాలా ఉంది. రిజర్వేషన్‌లోనూ సీట్లు లేవు. వెంటనే తన వద్ద ఉన్న ఓ కార్‌పూలింగ్ యాప్ ఓపెన్ చేసి, సీటు బుక్ చేసుకుని రాజధానికి వెళ్లిపోయాడు అఖిల్.

బదిలీల అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు సైతం నలుగురు లేదా ఐదుగురు ఎంప్లాయీస్ కలిసి కార్ పూలింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకే ఆఫీసులో పనిచేయడం, కారు అయితే స్టాపుల్లేకుండా నేరుగా ఆఫీసుకే వెళ్లే వీలుండటంతో కార్ పూలింగ్‌కు మొగ్గు చూపుతున్నారు.

అద్దెకారు జర్నీ ఖరీదైంది. ఇద్దరు.. నలుగురు కలిసి కరీంనగర్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లాలంటే రూ.5వేలకు తక్కువ ఖర్చవడం లేదు. పెరిగిన ఇంధన ధరలు, ఖర్చుల నేపథ్యంలో అంతకన్నా తక్కువ తీసుకుంటే తమకు గిట్టుబాటు కాదని కారు నిర్వాహకులు చెప్పేస్తున్నారు. బస్సుల్లో రద్దీ, సమయం వృథా, సిటీలో ట్రాఫిక్ జామ్ నేపథ్యంలో సరే అని కారులో వెళ్లిపోతున్నారు. అయితే అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ కారు ప్రయాణాన్ని చౌకకే అందిస్తోంది. కార్ పూలింగ్‌కు కొన్నియాప్‌లు అందుబాటులో ఉండగా ఉమ్మడి జిల్లా నుంచి చాలామంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేవారు.. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చేవారు కార్ పూలింగ్ ద్వారా ప్రయాణం చేస్తున్నారు. తక్కువ ధరకే షేరింగ్ జర్నీ చేస్తూ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. కారు నిర్వాహకులకు సైతం ఇం'ధన'ం ఆదా అవుతోంది. అసలేంటీ 'కారు'చౌక జర్నీ అనుకుంటున్నారా..? చదవండీ సండే స్పెషల్..!!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో కార్ పూలింగ్ కల్చర్ పెరిగిపోతోంది. పెరిగిన రద్దీతో ఉద్యోగులు, విద్యార్థులు ఈ విధమైన ప్రయాణానికి పెద్దపీట వేస్తున్నారు. జిల్లా కేంద్రాలైన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల నుంచి ప్రతీరోజు రాజధానితో పాటు వరంగల్, మంచిర్యాల, గోదావరిఖని, నిజామాబాద్ ఇలా ఏ ప్రాంతానికైనా కార్ పూలింగ్‌కే జై కొడుతున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ తరువాత ఆ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న నగరం కరీంనగర్. ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాదిమంది హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై, చెన్నై తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, కార్పొరేట్ తదితర మల్టీనేషనల్ కంపెనీల్లో కొలువు చేస్తున్నారు. వీరంతా వారాంతానికి ఉమ్మడి జిల్లాకు రావడం, తిరిగి సోమవారం ఉదయానికి వారి ఉద్యోగస్థానాలకు వెళ్లడం రివాజుగా మారింది. దీనికి తోడు ప్రతిరోజూ కోర్టు కేసులు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, రకరకాల అవసరాల రీత్యా రాజధానికి వెళ్లేవారి సంఖ్య లెక్కేలేదు.

ఉమ్మడి జిల్లాలో కార్ల సంఖ్య ఇలా

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కార్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్యాంకుల సులభ వాయిదా రుణాలు, మార్కెట్‌లోకి కొత్త కార్లు వస్తుండటం, కరోనా తరువాత భౌతిక దూరానికి ప్రాధాన్యం పెరగడంతో సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ కూడా ఊపందుకుంది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రిజిష్టర్ అయిన కార్ల వివరాలే నిదర్శనం.

కరీంనగర్:	47,023
సిరిసిల్ల:	11,911
జగిత్యాల:	12,824
పెద్దపల్లి:	10,400

టోల్‌గేట్‌ల వద్ద తాకిడి

పాత జిల్లాలో రెండు ప్రధాన టోల్‌గేట్లు ఉన్నాయి. ఇందులో ఒకటి కరీంనగర్ జిల్లా రేణికుంట వద్ద కాగా, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వద్ద రెండోది ఉంది. ఈ టోల్‌గేట్ల మీదుగా ప్రతిరోజూ రాకపోకలు సాగించే కార్ల వివరాలు ఇలా ఉన్నాయి.


టోల్‌గేట్	హైదరాబాద్ వైపు	హైదరాబాద్ నుంచి
రేణిగుంట	5,500 సుమారు	5,000 సుమారు
బసంత్‌నగర్	1,500 సుమారు	1,100 సుమారు

ఓనర్, రైడర్‌కు మేలు

ఈ యాప్‌లు కార్లు లేని వారికే కాదు సొంత వాహనాలు ఉన్న వారికీ సౌకర్యంగా ఉంటుంది. చాలామంది ఉమ్మడి జిల్లాకు వివిధ పనులు, పండుగలు, సెలవులకు వచ్చి, కుటుంబ సభ్యులను దింపి తిరిగి ఒంటరిగా వెళ్తుంటారు. అంటే దాదాపు గంటల కొద్దీ ప్రయాణం ఒంటరిగా చేయాలి. అదే సమయంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వెళ్లే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తమ కొలీగ్స్ రానప్పుడు ఈ యాప్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎవరికైనా పెట్రోల్ ఖర్చు ఆదానే కదా. అందుకే, బ్లాబ్లా కార్, క్విక్‌రైడ్ యాప్‌లో రైడ్ వివరాలు పోస్టు చేస్తున్నారు. క్షణాల్లో కారు ఖాళీ సీట్లు నిండిపోతున్నాయి. కారు ఓనరూ ఆర్టీసీచార్జీలే తీసుకుంటుండటంతో జర్నీలో టైంపాస్, పెట్రోల్ చార్జీలు కలిసి వస్తున్నాయి.

నచ్చిన చోట పికప్.. డ్రాప్

ఈ యాప్‌తో మరో సదుపాయం ఏంటంటే.. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లినప్పుడు ముందు రైల్వేస్టేషన్/బస్టాండ్‌లో దిగుతాం. అక్కడి నుంచి మనం అనుకున్న స్థానాలకు వెళ్లాలంటే క్యాబ్‌లకు రూ.200, 300 పెట్టాలి. ట్రాఫిక్‌తో గంటలపాటు ఇరుక్కుపోతుంటారు. కానీ, ఈ యాప్ ద్వారా ఓనరు ప్రయాణించే మార్గంలో మనకు నచ్చిన చోట దిగవచ్చు. ఉదా: నిమ్స్ వెళ్లాలనుకుంటే మెహదీపట్నం వెళ్లే కారును ఎంచుకోవచ్చు. హైటెక్ సిటీ వెళ్లాలనుకుంటే కొండాపూర్ వెళ్లే కారును సెలెక్ట్ చేసుకుని, అక్కడే దిగిపోవచ్చు. చాలా కార్లు ఓఆర్ఆర్ మీదుగా వెళ్తుండటంతో సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.





సమయానికి చేరుకోవచ్చు



హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు కార్ పూలింగ్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ప్రయాణించడం ద్వారా సమయం, డబ్బులు ఆదా అవుతున్నాయి. ఎలాంటి ఆలస్యం లేకుండా గమ్యానికి అనుకున్న సమయంలోనే చేరుకునే వెసులుబాటు ఉంది. వివిధ వ్యాపారాల రీత్యా దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కార్ పూలింగ్ యాప్‌ను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు.

– శనిగరపు రవీందర్, ప్రభుత్వ ఉద్యోగి

న్యూస్‌రీల్

అపరిచితులను నమ్మొద్దు



మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు అపరిచితులతో నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పరుశురాంనగర్‌లో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలపై అఘాయిత్యాలను అరికట్టడానికి ప్రభుత్వం పోక్సో చట్టం అమలులోకి తెచ్చిందని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, న్యాయవాదులు గుడికందుల భూమయ్య, ప్రవీణ్‌కుమార్, కాదాసి శేఖర్, మాట్ల భానుకృష్ణ, వరలక్ష్మి, లీగల్ సోషల్ వలంటీర్ ఎం.శంకర్, సుజాత, హెడ్‌మాస్టర్ ఐ.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



వివరాలు సేకరిస్తున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రజలు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మున్సిఫ్ కోర్టు జడ్జి ప్రియాంక సూచించారు. స్థానిక సివిల్ ఆస్పత్రిని శనివారం జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, జనరల్, గైనిక్ వార్డుల్లో పర్యటించారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన పేషెంట్లతో మాట్లాడారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. సీజనల్, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణపై అవగాహన ఉండాలని సూచించారు. వైద్య సేవలు బాగున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసలు



విద్యార్థులతో అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి సాంఘికశాస్త్రం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జి డీఈవో హన్మంతు తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం సోషల్‌ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు సోషల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రతంగపాణిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మారం రమేశ్, గడ్డం రాజనర్సు సర్టిఫికెట్లు అందజేసి ప్రశంసించారు. జిల్లాస్థాయి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 10న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వీరలక్ష్మణ్, లింగం శ్రీనివాస్, పోచయ్య, అంజయ్య, గంగారెడ్డి, పద్మ, రమ, స్వరూప పాల్గొన్నారు.

డీఎంకు సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందిస్తున్న ప్రతినిధులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ప్రతినిధులు కోరారు. తొలుత హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సార్వత్రిక సమ్మెలో హెచ్‌పీసీఎల్ డిపో కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొంటారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఎస్.భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంథని: స్థానిక శ్రీగౌతమేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎండోమెంట్ డెప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీచేసినట్లు మంథని ఈవో రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు సభ్యులతో కూడిన ట్రస్టు బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ప్రత్యేకాధికారుల పాలన భేషుగ్గా సాగాలి
- 7 నుంచి వారంపాటు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రావొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: 'సర్పంచుల పదవీ కాలం ముగిసింది.. పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది.. పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి.. ఇందుకు అనుగుణంగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాల'ని మంత్రి సీతక్క ప్రత్యేకాధికారులకు సూచించారు. శనివారం పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

ఈనెల 7నుంచి 15వ తేదీ వరకు ప్రతీఊళ్లో పారిశుద్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు సమకూర్చుకోవాలని సూచించారు. పైపులైన్ లీకేజీలను గుర్తించి ఆర్థిక సంఘ నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, డీఆర్డీవో శ్రీధర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను నియంత్రిద్దాం



విద్యార్థులతో అతిథుల గ్రూప్ ఫొటో

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, వ్యాధి నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై కనీస అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు ట్యాంకుబండ్‌పై శనివారం క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీసీపీ చేతన, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డితో కలిసి జడ్జి మాట్లాడారు. క్యాన్సర్ నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలు, పద్ధతులపై వైద్యశాఖ విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాప్రయోజనాల కోసమే వినియోగించాలని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులపై ప్రేమాభిమానాలు, గౌరవభావంతో మెలగాలని సూచించారు. ఇంటర్నెట్‌తో చెడు సహవాసాలు చేస్తే భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. అపరిచితులతో సెల్‌ఫోన్‌లో అనవసరంగా మాట్లాడడం సరికాదన్నారు. సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఐటీ విద్యార్థులు రూపొందించిన డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకుని జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రెండుకోట్ల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, వైద్యాధికారులు మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్, సంకీర్తన, సీఐ కృష్ణ, ఎస్సై మల్లేశ్, పెద్దపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు శ్రీపతి సత్తయ్య, సంతోష్, నరేశ్, శరత్‌తోపాటు గాయత్రీ జూనియర్ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: మేడారం జాతరకు తరలివెళ్లే భక్తుల కోసం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక బస్ షెల్టర్ ఏర్పాటు చేసి, మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మేడారం జాతరకు 125, గోలివాడ జాతరకు 12 ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఎం.నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

స్థానిక గాంధీపార్క్ ఎంపీపీఎస్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీచేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

మంచినీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ నల్లా కనెక్షన్, ఆర్‌వో వాటర్ ప్లాంట్, సోలార్ పవర్, స్టేజీ నిర్మాణానికి ఎన్టీపీసీ, సింగరేణి సహకారంతో కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు మహంకాళి స్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ

- 14 ప్రగతి పనులపై గతంలోనే ఫిర్యాదులు
- క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్న అధికారులు
- మరోసారి కీలక ఫైళ్ల తనిఖీ
- రెండు రోజుల తర్వాత బల్దియాకు రానున్న అధికారులు
- ఇప్పటికే శాంపిళ్లను టెస్టింగ్‌కు పంపించిన విజిలెన్స్ విభాగం
- తాజా విచారణతో హడలెత్తుతున్న బల్దియా యంత్రాంగం



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై అందిన ఫిర్యాదులపై 10 నెలలుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. పట్టణ ప్రగతి నిధులతోపాటు 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించిన 14 అభివృద్ధి పనుల్లో పారదర్శకత లోపించిందని గతంతో కొందరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలు ఇవ్వాలనే 14 ప్రశ్నలతో కూడిన నివేదికను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం బల్దియా అధికారులకు గతంలోనే అందజేసింది. ఆ నివేదిక ఆధారంగా గతంలో పలు దఫాలుగా విజిలెన్స్ అధికారులు నేరుగా విచారణ జరిపారు. ఇందులో భాగంగా మరోసారి.. శనివారం ఏఈఈ స్థాయి కలిగిన ఇద్దరు విజిలెన్స్ అధికారులు.. బల్దియా కార్యాలయానికి చేరుకున్నారు. వారు చేపట్టిన విచారణతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హడలెత్తిపోతున్నారు.

ఐదు అభివృద్ధి పనులపైనే ఫోకస్?

- నగరంలో చేపట్టిన 14 అభివృద్ధి పనులపై అందిన ఫిర్యాదులో సుమారు రూ.2కోట్లకుపైగా వ్యయం చేసే ఐదు అభివృద్ధి పనులపై విజిలెన్స్ విభాగం అధికారులు ప్రధానంగా దృష్టి సారించారని సమాచారం.
- ఇప్పటికే పలు డివిజన్లలో జరిగిన అభివృద్ధి పనులపై కూడా కీలక వివరాలు సేకరించారు.
- వీటి ఆధారంగా పలు డివిజన్లలో క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు నిర్మించిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు తదితర పనుల కొలతలు సేకరించి, కటింగ్ చేసి శాంపిళ్లను నాణ్యత తనిఖీల కోసం ల్యాబ్‌కు పంపించారు.
- వీటి నివేదికలు మరో నాలుగైదు రోజుల్లో రానున్నాయని తెలిసింది.

ఒరిజినల్ రికార్డుల తనిఖీ..

అభివృద్ధి పనులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగం నుంచి సమగ్ర నివేదికను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇప్పటికే సేకరించింది. ఇందులో అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక, అంచనాలు, నోటిఫికేషన్, టెండర్ డాక్యుమెంట్లు, కౌన్సిల్ తీర్మానం, అగ్రిమెంట్, ఎంబీలు, అభివృద్ధి పనులను అధికారులు తనిఖీ చేసిన నివేదిక, థర్డ్ పార్టీ ఇచ్చిన క్వాలిటీ నివేదిక తదితర కీలక వివరాలను అడిగిన విజిలెన్స్ అధికారులకు బల్దియా ఇంజినీర్లు గతంలోనే సమర్పించారు. గతంలో బల్దియా అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగా శనివారం బల్దియా కార్యాలయంలో వాటికి సంబంధించిన ఒరిజినల్ ఫైళ్లను తనిఖీ చేశారు. విజిలెన్స్ విభాగం అధికారులు అడిగిన మరిన్ని నివేదికలను పంపించే తీరుపై ఇంజినీరింగ్ అధికారులకు వివరించారు. కాగా, రెండు మూడు రోజుల్లో మరోసారి, మరికొంత సమాచారం సేకరించడం కోసం విజిలెన్స్ అధికారులు బల్దియాకు రానున్నారని సమాచారం.

పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేసిన ప్రతీ ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక గౌతమి బుద్ధ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. తొలుత పార్టీ మండల అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారినుంచి అభిప్రాయాలు సేకరించారు. బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, గందం మహిపాల్ అధ్యక్ష స్థానం కోసం పోటీపడ్డారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు ముగ్గురిలో ఒకరిని అధ్యక్షుడిగా ప్రకటిస్తామని లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎంపీపీ కొడారి అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఏసీ విజయసారథి

కరీంనగర్ అర్బన్: తూకంలో మోసాలు, నిబంధనలను విస్మరించే బియ్యం దుకాణాలపై తూనికలు, కొలతలశాఖ దాడులు కొనసాగిస్తోంది. శనివారం తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కె.విజయసారథి అధ్వర్యంలో నగరంలోని పీవీఎస్ ట్రేడర్స్, అన్నపూర్ణ రైస్ స్టోర్స్, సూర్య రైస్ దుకాణాలతో పాటు పెట్రోల్ బంకులు తనిఖీ చేశారు. కొలతల్లో తేడాలు లేవని తెలుపగా బియ్యం బస్తాల తూకం తక్కువగా ఉండటంతో పీవీఎస్ ట్రేడర్స్‌పై కేసు నమోదు చేశారు. నిబంధనలను విస్మరించిన అన్నపూర్ణ రైస్‌స్టోర్స్, సూర్య రైస్‌పై రెండు కేసులు నమోదు చేసినట్లు ఏసీ వివరించారు. జిల్లా తూనికలు, కొలతల అధికారి భూలక్ష్మి పాల్గొన్నారు.

వారధి సొసైటీ రద్దు చేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రభుత్వ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కల్పన పేరుతో అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన వారధి సొసైటీని రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. శనివారం పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. పదేళ్లనుంచి అక్రమాలకు పాల్పడుతున్న వారధి సొసైటీ కార్యదర్శిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన వారధి అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. సొసైటీ కార్యదర్శిని తొలగించి, ఆయన అభియోగాలపై విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహన్, బోనాల శ్రీనివాస్, ఎస్.ఎ.మోసిన్, అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రేకుర్తి ఆస్పత్రికి మెల్లకన్ను చికిత్స వైద్యుల రాక

కొత్తపల్లి: రేకుర్తిలోని లయన్స్ కంటి ఆసుపత్రికి ఈ నెల 5వ తేదీన మెల్లకన్ను, చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, శుక్లం (మోతె బిందు)కు సంబంధించిన ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ఆసుపత్రి ట్రస్టుబోర్డు సభ్యుడు, ఇంజినీర్ కోల అన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో దొరికే సేవలు తక్కువ ఖర్చుతో రేకుర్తిలో పొందేందుకు 7673983940 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కథ చెబుతాం..

- ఒగ్గుకథలు చెబుతున్న యువకులు
- చదువు.. ఉద్యోగం.. కులవృత్తి
- తండ్రుల బాటలో తనయులు
- ఆదివారం, సోమవారం పూజా కార్యక్రమాలు
- మిగతా రోజులు సాధారణ పనులు



మల్లన్న పట్నం వేస్తున్న యువ ఒగ్గు కళాకారులు

వేములవాడఅర్బన్: అవును.. వాళ్లు కథలు చెబుతున్నారు. ఊ కొట్టే కథలు కావు. పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన కథలు. పల్లెల్లో ఆధ్యాత్మిక భావాలు నింపే ఒగ్గుకథలు. దశాబ్దం క్రితం కులవృత్తి అంటే చిన్నచూపు చూడడంతో జానపదుల కళలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలోనే నేటి యువత ఇటు చదువుతోపాటు అటు కులవృత్తిని ఉపాధిరంగంగా ఎంచుకుంటుంది. బీటెక్, బీఈడీ, డిగ్రీలు, పీజీలు చదువుతూనే ఒగ్గుకథలు, మల్లన్న పట్నాల కథలు చెబుతున్నారు. కులవృత్తిని కాపాడుతూనే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఒకప్పుడు మల్లన్నపట్నాలు అంటేనే కథకులు పెద్ద వయసు వారు వచ్చేవారు. కానీ నేడు పరిస్థితులు మారాయి. పాతికేళ్లు కూడా నిండని యువత మల్లన్నపట్నాల బాధ్యతలు తమ బుజాలపై వేసుకుంటున్నారు. కథలు చెబుతూ పల్లెప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

మూడు నెలలు కథలు చెబుతూ..

తాతలు.. తండ్రుల నుంచి వచ్చిన కులవృత్తిని ఉపాధిరంగంగా ఎంచుకున్న నేటి యువత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే కథలు చెబుతున్నారు. ఈ మూడునెలల్లో ప్రతీ ఆదివారం మల్లన్న పట్నాల పూజలు చేస్తూ బిజీగా ఉంటున్నారు. ఒకరి ఇంట్లో మల్లన్నపట్నాల పూజలకు ముగ్గురు యువకులు వెళ్లి దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు.

కులవృత్తిపై మమకారంతో..

కులవృత్తిపై మమకారంతో ఇటీవల యువత మల్లన్నపట్నాలు, బీరప్ప కథలు చెప్పేందుకు ముందుకొస్తున్నారు. బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో దాదాపు 50 మంది ఒగ్గుకథ కళాకారులు ఉన్నారు. ఇందులో 20 మంది వరకు పాతికేళ్లు కూడా నిండని యువతే. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మూడు నెలల్లో ప్రతీ ఆదివారం, సోమవారం మల్లన్న పట్నాల పూజలకు వెళ్తుంటారు. కులవృత్తిని గౌరవిస్తూనే ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. బోయినపల్లి మండలానికి చెందిన కళాకారులు వేములవాడ, బావుపేట, కందికట్కూర్, వాసంపల్లి, అయ్యోరుపల్లి గ్రామల మధ్యలో విస్తరించి ఉన్న ప్రాంతంలో మల్లన్నపట్నాల పూజలు చేస్తుంటారు. వివిధ దేవుళ్లు, జానపదల కథలు చెబుతుంటారు.



మల్లన్న పట్నాలలో ఆడ వేషధారణలో కథలు చెబుతున్న యువ కళాకారుడు

చదువుకుంటూనే..



నేను ఆరేళ్లుగా మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. ఇప్పుడు బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. ఈ సీజన్‌లో పట్నాల పూజలకు తీరిక లేకుండా వెళ్తున్న. అక్కడ కథలు కూడా చెబుతుంటాను.

– అక్షయ్, బీటెక్ విద్యార్థి

ఉద్యోగంతోపాటు కథలు



నేను 12 ఏళ్లుగా మల్లన్నపట్నాల పూజలకు వెళ్తున్నాను. చదువుకుంటూ కథలకు వెళ్లేవాడిని. ఇప్పుడు కోనరావుపేట మండలంలో ఔట్ సోర్సింగ్‌లో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఆది, సోమవారాల్లో మల్లన్నపట్నాల పూజలకు వెళ్తున్నాను.

– మహేశ్, ఒగ్గు కళాకారుడు

మా నాన్నతోపాటు వెళ్తున్నాను



నేను గత 8 ఏళ్లగా మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. ఇంటర్ పూర్తి చేశాను. ప్రస్తుతం మా నాన్నతో కలిసి మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. కథల లో ఆడవేషాలు కూడా వేస్తున్నాను. ఈ సీజన్‌లో మేము మల్లన్న పట్నాలు ఎక్కువగా చేశాం.

– ప్రవీణ్, ఒగ్గు కళాకారుడు

హామీలు నెరవేర్చండి

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, ప్రజాప్రతినిధులు గంట రాములు, రమాదేవి, రేణుక, సంపత్, మల్లేశంతో కలిసి ఆయన జిల్లా కేంద్రంలో శనివా రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో గెలుపోటములు సహజమన్నా రు. ఓటమిని తాము హుందాగా స్వీకరించామని, కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభివృద్ధి, ఆరు గ్యారంటీల అమలుపై శ్రద్ధ చూపకుండా బీ ఆర్ఎస్ నాయకులపై దాడులకు దిగుతోందని ఆరోపించారు. సోషల్ మీడియాలోనూ బెదిరిస్తోందన ఆవేదన చెందారు. వీటన్నింటికీ కాంగ్రెస్ నేతలు, పాలకులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఇసుక, మట్టి రవాణ ఆపలేరా..!

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇసుక, మట్టిని తామే అమ్ముకున్నట్లు ఆరోపిస్తూ ప్రజల ముందు దొంగలుగా చిత్రీకరించేందుకు యత్నించారని, ఇప్పుడు విజయరమణారావు ఎమ్మెల్యేగా ఎన్నికైనా మట్టి, ఇసుక దందా యథేచ్ఛగా సాగుతున్నా ఎందుకు ఆపడంలేదని ఓదెల జెడ్పీటీసీ గంట రాములు ప్రశ్నించారు. అక్రమంగా తరలిపోతున్న సహజ సంపదను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు నియోజకవర్గస్థాయి సమావేశం

బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం(ఈనెల 5న) రాఘవాపూర్ రెడ్డిగార్డెన్‌లో నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు బండారి శ్రీనివాస్, పాల రామారావు, కాశిపాక వాసు, చొక్కారెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లిలో బీజేపీదే విజయం

- నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ
- మంథనిలో పార్టీ జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మంథని: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక రాంరెడ్డి కాంప్లెక్స్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ పాలన కొనసాగాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కల నెరవేర్చిన ఘనత మోదీకే సాధ్యమైందని అన్నారు. పేదలకు ఉపయోగపడే అనేక పథకాలు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ప్రతిఒక్కరూ సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్, నాయకులు బల్మూరి వనిత, బల్మూరి అమరేందర్‌రావు, కందుల సంధ్యారాణి, వడ్డేపల్లి రాంచందర్, స్వామి, వెంకటేశ్వర్, హనుమంత్, పర్వతాల్, గాండ్ల ధర్మపురి, కొండపాక సత్యప్రకాశ్, మల్క మోహన్, బోగోజు శ్రీనివాస్, మాతంగి రేణుక పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విజయం సాధ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ గంగయ్య

చొప్పదండి: చదువుపై ఏకాగ్రత సాధిస్తే విజయం బానిసగా మారుతుందని డిప్యూటీ కలెక్టర్ బొద్దుల గంగయ్య అన్నారు. పట్టణంలోని సాంఘిక, సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ స్వాతి అధ్యక్షతన శనివారం విద్యార్థులు, భవిష్యత్తుకు మార్గాలు అనే అంశంపై జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక సాంకేతిక రంగంలో రాణించాలంటే అన్ని అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, సమయాన్ని సద్వినియోగం చేసుకున్నవారు చరిత్రకారులుగా మిగులుతారని పేర్కొన్నారు. నిర్ధిష్టమైన ప్రణాళికతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కష్టంతోకాకుండా ఇష్టంతో చదివితే విజయాలు సొంతమవుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అలివేలు దీప్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ర్యాష్ డ్రైవింగ్

- ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



అభిలాష్(ఫైల్)



అవినాశ్‌కుమార్(ఫైల్)

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): అజాగ్రత్తగా బైక్‌లు నడపడంతో ఎదురెదురుగా ఢీకొని వేల్పుల అవినాశ్‌కుమార్(16), పూరెళ్ల అభిలాశ్(18) దుర్మరణం చెందారు. మిత్రులతో సర్కస్ తిలకించేందుకు వెళ్లిన వీరిద్దరూ అనూహ్యంగా మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ప్రమాదం శుక్రవారం అర్ధరాత్రి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లోకపేటలో చోటుచేసుకుంది. జూలపల్లి ఎస్సై వెంటకృష్ణ కథనం ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన అవినాశ్‌కుమార్, పెద్దపల్లికి చెందిన అభిలాశ్, వేల్పుల రమేశ్, పంబాల మనోజ్, దాడి రామ్‌చరణ్, కొలిపార రాంచరణ్ మిత్రులు. ఎలిగేడు మండలం ముప్పిరితోటలో ప్రదర్శిస్తున్న సర్కస్ చూసేందుకు ఈ ఆరుగురు మిత్రులు రెండు బైక్‌లపైరాత్రి బయలుదేరి వెళ్లారు. సర్కస్ తిలకించాక అవే బైక్‌లపై ఇంటిదారి పట్టారు. ఈక్రమంలో ఎలిగేడు మండలం లోకపేట శివారులోని వంతెన వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఓ బైక్ అవినాశ్‌కుమార్, అభిలాశ్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అవినాశ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలాశ్‌ను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. వీరిని ఢీకొన్న మరోబైక్ నడుపుతున్న ముప్పిరితోటకు చెందిన మాదారపు వెంకట్రావు తీవ్రంగా గాయపడగా, కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇతడి పరిస్థితి విషమంగా ఉంది. మిగతా స్నేహితులు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. అవినాశ్ తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు కుటుంబాల్లో తీరని విషాదం..

పెద్దపల్లికి చెందిన పూరెళ్ల శ్రీనివాస్ – కవిత దంపతుల చిన్నకుమారుడు అభిలాశ్. వీరిది నిరుపేద కుటుంబం. అభిలాశ్ ఇంటర్‌పూర్తి చేశాడు. స్నేహితులతో సర్కస్ చూసేందుకు వెళ్లి వస్తూ మృతిచెందడంతో కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన అవినాశ్ కుమార్ పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలోనే తల్లి మృతి చెందింది. తండ్రి మల్లేశం అన్నీ తానై చదివిస్తున్నాడు. మిత్రులతో కలిసి సర్కస్ చూసేందుకు వెళ్లి కానరాని లోకాలకు వెళ్లడంతో తండ్రి కన్నీరుమున్నీరవుతున్నాడు.

ఆమె పరీక్ష రాస్తే ఉద్యోగమే..

- మూడు ఉద్యోగాలు సాధించిన లాస్య
- తాజాగా నర్సింగ్ ఉద్యోగ పరీక్షలో ర్యాంకు
- సీఎం చేతులమీదుగా నియామక పత్రం



లాస్య

మెట్‌పల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం ఒక్కటి సాధించడమే కష్టం. అలాంటిది ఈ యువతి ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన లాస్యకు మెట్‌పల్లిలోని దుబ్బవాడకు చెందిన జెట్టి నరేందర్‌తో వివాహమైంది. చదువులో చురుకుగా ఉన్న లాస్య ఇంటర్ వరకు నిర్మల్‌లోనే పూర్తి చేశారు. నిజామాబాద్ సమీపంలోని ఓ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ చదివారు. 2022 జనవరిలో సింగరేణి సంస్థ నిర్వహించిన నర్సింగ్‌లో ప్రతిభ చూపారు. అందులో ఉద్యోగానికి ఎంపికైన ఆమె రామకృష్ణాపూర్‌లోని సంస్థకు చెందిన ఆసుపత్రిలో పోస్టింగ్ ఇచ్చారు. అనంతరం అఖిల భారతీయ వైద్యవిజ్ఞాన సంస్థ నిర్వహించిన పరీక్షలోను మంచి మార్కులు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. కొద్దిరోజులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నర్సింగ్ ఉద్యోగ పరీక్షలో బాసర జోన్‌లో మొదటిర్యాంకు, రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నారు. భర్త నరేందర్, కుటుంబ సభ్యుల సహకారంతో విజయం సాధ్యమైందని లాస్య పేర్కొన్నారు. సింగరేణి ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్న ఆమె.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పోస్టింగ్‌లో జాయిన్ అవుతానని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



అజీమ్ (ఫైల్)

జమ్మికుంట: పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నాననే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జమ్మికుంట పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ.అజీమ్(18) కొన్నేళ్లుగా పదోతరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతూ వస్తున్నాడు. ఓపెన్ పరీక్షలు రాసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు శనివారం వేకువజామున ఇంటినుంచి బయటకు వెళ్లాడు. గ్రామసమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి రాజ్ మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ వివరించారు.

సీపీ రెమా రాజేశ్వరికి వీడ్కోలు



రెమా రాజేశ్వరిని సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు ఐజీగా బదిలీపై వెళ్తున్న రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరికి శనివారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్టీపీసీ కాకతీయహాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ప్రతిభ, అంకితభావం, అందించిన సేవలు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి పోలీసు అధికారులు మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో . ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, సుధీర్ కేకన్, పోలీసు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబీ పనులు వేగవంతం చేయండి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఓబీ తొలగింపు పనులు కీలకమని సింగరేణి సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం సూచించారు. శనివారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఓవర్‌బర్డెన్ వెలికితీతకు సంబంధించిన పనులు, ఓవర్ బర్డెన్ తరలింపులో పాటించాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. జీడీకే-5ఓసీపీలో ఓబీ తొలగింపునకు సంబంధించిన కాంట్రాక్టర్ చేపడుతున్న పనుల గురించి ఆరా తీశారు. ఓబీ వెలికితీతపైనే బొగ్గు ఉత్పత్తి ఆధారపడి ఉంటుందని అన్నారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన శ్రీపతి నరేశ్(37) అనే సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేక హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల స్వస్థలం వచ్చాడు. అయితే, ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంటి ఎదుట ఉన్న షెడ్డు పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కెనాల్‌లో మృతదేహం లభ్యం



వివరాలను నమోదు చేసుకుంటున్న పోలీస్

హుజూరాబాద్ రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో శనివారం మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కెనాల్‌లో మృతదేహం కొట్టుకొస్తుండటంతో గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించామన్నారు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి తనిఖీ చేయగా కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన ఆర్.శశిధర్‌గౌడ్(40)గా గుర్తించిచారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గని కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఏఐటీయూసీకి దక్కిందని ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక తొలిసారి ఇక్కడకు వచ్చిన సీతారామయ్యను శనివారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటిన ఝార్ఖండ్‌లో జరిగిన ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశంలో తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఇది సింగరేణి కార్మికుల ఘన విజయమని పేర్కొన్నారు. కోలిండియా పరిధిలో ఎనిమిది కంపెనీలతోపాటు సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా కోలిండియా యాజమాన్యంతో దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గుగని కార్మికుల సమస్యలను మాట్లాడే అవకాశం తనకు దక్కడం సంతోషకరమన్నారు. గత వేజ్‌బోర్డు సమావేశాల్లో యూనియన్‌కు ప్రాతినిధ్యం ఉందని, ప్రస్తుతం సింగరేణితోపాటు కోలిండియా చైర్మన్‌తో వివిధ సమస్యల పరిష్కారం కోసం చర్చించే అవకాశం అందుబాటులోకి వచ్చిందని అన్నారు. కోలిండియాలో కాంట్రాక్టు కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు అమలు చేస్తే సింగరేణిలో అమలు కావడం లేదని, పింఛన్, సీపీఆర్ఎంఎస్ సమస్యలు, రక్షణ అంశాలు, అదనపు క్వార్టర్లు సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. వీటి పరిష్కారం కోసం ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడి హోదాలో పనిచేస్తానని చెప్పారు. రాంచీ నుంచి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సీతారామయ్యకు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం, మాదన మహేశ్, తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలతోనే అభివృద్ధి



విద్యార్థులతో అధికారులు

పెద్దపల్లిరూరల్: శాస్త్రీయ దృక్పథం, ఆలోచనలతోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి హన్మంతు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబురాలు ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో 24 టీములు పాల్గొనగా.. ఇంగ్లిష్ మీడియంలో సుల్తాన్‌పూర్, తెలుగు మీడియంలో పెద్దపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచాయని హన్మంతు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 9, 10, 11వ తేదీల్లో జనగామలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో పీఏ షేక్, ఎంఈవో సురేంద్రకుమార్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, కార్యక్రమ జిల్లా కన్వీనర్ హరిప్రసాద్, హెచ్ఎం అరుణ, పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, కోఆర్డినేటర్ శ్రీనివాస్, కొమురయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటాలని డీవైఎస్‌వో కీర్తి రాజవీరు అ న్నారు. శనివారం నుంచి యాదాద్రి జిల్లా భువనగిరిలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి చారి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, గౌరవ అధ్యక్షుడు సంతోష్, శివ పాల్గొన్నారు.